ప్రజాశక్తి
శుక్రవారం 25 జులై 2025 | 5 | శ్రీ సత్యసాయి

## జీడిపల్లి రిజర్వాయర్‌కు కృష్ణా జలాలు

ప్రజాశక్తి-బెలుగుప్ప

కృష్ణా జలాలు పరవళ్లు తొక్కుతూ జీడిపల్లి రిజర్వాయర్‌కు చేరాయి. రాగులపాడు పంప్‌హౌస్ నుండి గురువారం తెల్లవారుజామున అనంతపురం జిల్లా బెళుగుప్ప మండల పరిధిలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు నీళ్లు చేరాయి. నీళ్లు చేరిన సందర్భంగా హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు కృష్ణా జలాలకు జలపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీడిపల్లి రిజర్వాయర్ ద్వారా 1179 క్యూసెక్కుల నీరు వస్తాయన్నారు. కృష్ణా జలాలను చూసేందుకు రైతులు, గ్రామస్తులు జీడిపల్లి రిజర్వాయర్ వద్దకు చేరుకున్నారు. నీరు రావడాన్ని చూసి రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిఈఈఎం రామసుబ్బయ్య, ఈఈలు శ్రీనివాసులు, ఎస్‌ఈ రాజస్వరూప్ కుమార్, సీఈ నాగరాజ, ఏఈలు పృథ్వీ, రైతులు పాల్గొన్నారు.

జీడిపల్లి రిజర్వాయర్ వద్ద జలహారతి ఇస్తున్న హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు

సమావేశంలో మాట్లాడుతున్న డా॥రాయపాటి శైలజ

# మహిళల రక్షణే ధ్యేయం

**చట్టాలపై అవగాహన పెంచుకోవాలి**
**రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డా॥రాయపాటి శైలజ**

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

రాష్ట్రంలో మహిళలు, బాలికల రక్షణే ధ్యేయంగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డా॥ రాయపాటి శైలజ తెలిపారు. గురువారం పట్టణంలోని సాయి ఆరామంలో మహిళా సంక్షేమం, భద్రత, హక్కులు అనే అంశాలపై మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్‌తో పాటు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, ఎస్పీ వి.రత్న, ఆర్డీవో సువర్ణ, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, డిఇఒ కిష్టప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ మహిళల భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సమాజంలోని ప్రతి మహిళ, విద్యార్థినులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఏదైని అవర్యం, ఆగడాలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళా రక్షణ భద్రత మహిళా సాధికారికతపై చైతన్యవంతులు కావాలన్నారు. మహిళా చట్టాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. బాల్యవివాహాలు, గృహహింస, మహిళా ఉద్యోగులపై వేధింపులు, మైనర్ బాలికలపై వేధింపులు అత్యాచారాలపై ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో వాటిని నిరోధించడానికి కమిషన్ క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపడుతోందన్నారు. కళాశాలలో చదివే అమ్మాయిలు మోసపూరిత మాటలు నమ్మొద్దన్నారు. సెల్‌ఫోన్‌ను మంచికి మాత్రమే ఉపయోగించుకోవాలని సూచించారు. ఎస్పీ వి.రత్న మాట్లాడుతూ ఆడపిల్లలు, మహిళల భద్రత కోసం ఈగల్ యాప్ టోల్ ఫ్రీ నెంబర్ 1972ను పోలీస్ శాఖ ఏర్పాటు చేసిందన్నారు. ఆపద సమయంలో దీనిని ఉపయోగించుకోవాలన్నారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ ఆడ, మగ తేడా లేకుండా పిల్లలు ఇద్దరినీ తల్లిదండ్రులు సమానంగా పెంచాలన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ముందుకు సాగాలన్నారు. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని చట్టాలు హక్కులపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఆదినారాయణ, ఎస్‌ఎస్ఎ పీవో దేవరాజు, అంగన్వాడీలు, స్వయం మహిళా సంఘాల ప్రతినిధులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

**మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు కలిసిన అధికారులు**

**పుట్టపర్తి రూరల్ :** రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌ను పోలీసు మహిళా ఉన్నతాధికారులు, ఐసిడిఎస్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ముందుగా ప్రశాంతి నిలయంలో ఎస్పీ వి.రత్న ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. అనంతరం సాయి ఆరామం వద్ద ఐసిడిఎస్ జిల్లా అధికారిణి శ్రీదేవి, సిడిపిఒలు శాంతలక్ష్మి, రాధిక, సూపర్వైజర్లు, కొండసాని రజిత, శుభ, నాగరాణి, పుష్ప, పట్టణ సిఐ సునీత కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కొండసాని రజిత తను రచించిన 'ఒక కల రెండు కళ్లు' అనే పుస్తకాన్ని ఆమెకు బహూకరించారు. రాయపాటి శైలజ రజితను అభినందించారు.

రోడ్డు పక్కన పడేసిన వినియోగించిన ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు

- విచ్చలవిడిగా వినియోగం
- అక్టోబర్ 2లోగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం..?
- ప్రభుత్వ నిర్ణయం అమలుపై సందేహాలు
- నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్న అధికారులు

# ప్లాస్టిక్ మహమ్మారి..!

ప్రజాశక్తి-పెనుకొండ

పర్యావరణానికి హానికారిగా మారిన ప్లాస్టిక్ కట్టడిపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా అధికారులు దుకాణాలపై ఇటీవల దాడులు నిర్వహించి ప్లాస్టిక్ వస్తువులు వినియోగించే వారికి జరిమానాలు విధిస్తున్నారు. పల్లెలు, పట్టణాలు అన్న తేడాలేకుండా అన్నిచోట్ల ప్లాస్టిక్ విచ్చలవిడిగా వినియోగంలో ఉంది. ఈ నేపథ్యంలో అక్టోబరు 2వ తేదీ నాటికి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిస్థాయిలో నిషేధించాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయించింది. ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా రీ సైక్లింగ్, చెత్తను వేరుచేయడం వంటి ప్రక్రియను సంబంధిత అధికారులు వేగవంతం చేశారు. ఏళ్లుగా ప్లాస్టిక్ నిషేధం ఉన్నా అమలులో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలం అవుతోంది. విచ్చలవిడిగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల వినియోగం, క్రయవిక్రయాలు జరుగుతున్నా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఈనేపథ్యంలో అక్టోబర్ 2వ తేదీ నాటికి సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం అమలవుతుందా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

**అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం**

ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలున్నాయి. అందుబాటులో ఉన్న ప్లాస్టిక్ వస్తువులు, పాలిథిన్ కవర్లు ఇతర సామగ్రిని నిషేధించేందుకు వ్యాపారులతో సమావేశం నిర్వహించాల్సి ఉంది. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను తయారుచేసే యంత్రాలను తక్షణమే బ్యాన్ చేయాల్సుంది. ప్లాస్టిక్ వినియోగంతో తలెత్తే అనర్థాలపై ప్రజలకు పూర్తిస్థాయి అవగాహన కల్పించాల్సి ఉంది. ఈ చర్యలేవీ చేపట్టకుండా నిషేధం ఒట్టిమాట గానే మిగిలిపోతుంది.

**సహకరించని వ్యాపారస్తులు**

సింగిల్ యూజ్ వస్తువులు, పాలిథిన్ కవర్ల విక్రయదారులపై అధికారులు దాడులు చేసి జరిమానాలు విధించినా ప్లాస్టిక్ కవర్లు, ఇతరవస్తువులను విక్రయాలు ఆగలేదు. ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు వ్యాపారులు, దుకాణదారులు, హోటల్స్, బేకరీ యజమానులు సహకరించని పరిస్థితి ఉంది. వ్యాపారులు, హోటల్ యజమానులు పాలిథిన్ కవర్ల వినియోగానికి దూరంగా ఉండడంలేదు. ఇటీవల కాలంలో దుకాణాలు, హోటళ్లపై దాడులు చేసి, ప్లాస్టిక్ కవర్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తు వులు విక్రయిస్తున్న వారికి అధికారులు జరిమానాలు విధిస్తున్నా ఇవి పూర్తి స్థాయి ఫలితం ఇవ్వడం లేదు.

పెనుకొండలోని కాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది(ఫైల్ ఫొటో)

**విచ్చలవిడిగా వినియోగం**

స్వచ్ఛ భారత్‌లో భాగంగా 2018లో టీడీపీ ప్రభుత్వం ప్లాస్టిక్ నిషేధాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. అయితే ఇది అమలుకు నోచుకోలేదు. పట్టణాలు, మండలాల్లోని కాలువలు, డంపింగ్ యార్డుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు గుట్టల్లా పేరుకుపోయాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు అన్ని పట్టణాల్లో ప్లాస్టిక్ విని యోగం అధికంగా ఉంది. మండలా ల్లోనూ అదే పరిస్థితి కన్పిస్తోంది. ఎక్కడ చూసినా 80శాతం మేర సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల వ్యర్థాలే దర్శన మిస్తున్నాయి. హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలోనూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తున్నారు. వేడివేడి ఆహార పదార్థాలను ఇందులో ప్యాక్ చేసి ఇవ్వడం ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాలు శరీరంలో చేరి క్యాన్సర్‌కు కారకాలుగా మారుతున్నాయి. హానికరమైన ప్లాస్టిక్ నిషేధంపై అధికారులు తూతూమంత్రం చర్యలు కాకుండా పూర్తి స్థాయిలో చేపట్టాలనే డిమాండ్ ప్రజల నుంచి వ్యక్తం అవుతోంది.

పెనుకొండ నగర పంచాయతీ డంపింగ్ యార్డ్‌లో ప్లాస్టిక్ కవర్లను ఇతర వస్తువులను రీసైక్లింగ్ చేస్తున్న యంత్రం

**క్యాన్సర్ బారినపడే ప్రమాదం**

ప్లాస్టిక్ కవర్లు, పేపర్ల ద్వారా క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుంది. హోటళ్లలో ఆహార పదార్థాల పార్శిళ్లను సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నారు. అవి వేడివేడి ఆహార పదార్థాల్లో కలిపి శరీరంలో క్యాన్సర్ కారకాలుగా మారుతున్నాయి.

**మోహన్ నాయక్, వైద్యులు.**

**ఉత్పత్తిని నిలిపేయాలి**

ప్రభుత్వాలు ప్లాస్టిక్ కవర్లు వాడరాదని ప్రజలపై ఒత్తిడి తెస్తోంది. దీనికంటే ప్రభుత్వమే ప్లాస్టిక్ కవర్ల తయారీని నిలిపేసేలా కఠిన నిర్ణయాలు తీసుకోవాలి. ప్రభుత్వాలు ప్లాస్టిక్ తయారు చేసే కంపెనీలను హెచ్చరించాలి. నామమాత్రపు చర్యలు తీసుకోవడం ద్వారా ఎలాంటి ప్రయోజనం లేదు.

**రమేష్ నాయుడు, మునిమడుగు.**

## నేటి నుంచి జిల్లాలో జాతీయ కేంద్ర బృందం పర్యటన

### కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

గ్రామీణ అభివద్ధి పనులపై జాతీయ కేంద్ర బందం ఈనెల 25 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు జిల్లాలో పర్యటించనుందని కలెక్టర్ టిఎస్.చేతన్ తెలిపారు. గురువారం నాడు కలెక్టరేట్లో జాతీయ కేంద్ర బందం సభ్యులు దయాకర్ రెడ్డి, సిఎం.రెడ్డిలతో కలిసి కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25 నుంచి ఆగస్టు ఒకటవ తేదీ వరకు జిల్లాలోని అమరాపురం, గాండ్లపెంట, రామగిరి మండలాల్లోని 8 గ్రామపంచాయతీల్లో కేంద్ర బందం పర్యటిస్తుందన్నారు. గ్రామీణ అభివృద్ధి పనులను లబ్ధిదారులతో సమావేశమై ప్రత్యక్షంగా పరిశీలించనున్నట్లు తెలిపారు. ప్రధానంగా ఉపాధి హామీ పనులు, పింఛన్ల పంపిణీ, మహిళా సంఘాల పనితీరు, గృహ నిర్మాణం, వాటర్ షెడ్లు, గ్రామపంచాయతీ పనితీరు మొదలైన అంశాలపై ఈ బందం పరిశీలిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖ అధికారులు తమ శాఖల ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలపై పూర్తి సమాచారం నివేదికల ద్వారా అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, గృహ నిర్మాణ శాఖ అధికారి వెంకటనారాయణ, డిపిఒ సమంత తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌డిటి కోసం విద్యార్థుల పోస్ట్‌కార్డు ఉద్యమం

ప్రజాశక్తి-రొద్దం

కేంద్ర ప్రభుత్వం ఆర్‌డిటి సంస్థకు విదేశీ నిధులకు సంబంధించి వెంటనే ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలని కోరుతూ గురువారం మండలంలోని దొడఘట్ట ప్రభుత్వ హైస్కూల్, ఎంపియుపి పాఠశాల విద్యార్థులు పోస్ట్‌కార్డ్ ఉద్యమం చేపట్టారు. విద్యార్థులు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాకు 180 కార్డులు రాసి పోస్ట్‌బాక్స్‌లో వేశారు. విద్యార్థులు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేదలకు ఆర్‌డిటి సంస్థ ఎన్నో సహాయ సహకారాలు అందిస్తున్నారు. ప్రధానంగా పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యనందించి వారి జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. అలాంటి సంస్థకు రాజకీయాలకు అతీతంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో గోపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

## చిరుధాన్యాల సాగుపై శిక్షణ

ప్రజాశక్తి-గుడిబండ

స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం చిరుధాన్యాల సాగు, ఆరోగ్యం, తదితర అంశాలపై రైతులకు శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఏవో వీరనరేష్ తెలిపారు. పుట్టపర్తి ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రామసుబ్బయ్య మాట్లాడుతూ వేరుశనగ, కంది, మొక్కజొన్న, పత్తి, రాగి, కొర్ర పంటల్లో సస్యరక్షణ, ఎరువుల యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. వకుళ రకం రాగి, ఎస్ఎల్ఎ-3159 కొర్ర రకం మినీకిట్లను అభ్యుదయ రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మడకశిర ఎడిఎ కృష్ణమీనన్, ఎపి మాస్ ప్రాజెక్ట్ మేనేజర్ గోపాల్, ఎస్సీ ఆర్‌పి ఎపిఎం తిప్పన్న, ఎఫ్‌పిఒ దేవరాజు, జెడ్‌బిఎన్ఎఫ్ సిబ్బంది, రైతు సేవా కేంద్రం ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.

## గుర్రం జాషువాకు నివాళి

ప్రజాశక్తి-పెనుకొండ

తెలుగు సాహిత్య చరిత్రలో స్థానాన్ని పదిలం చేసుకున్న కవి గుర్రం జాషువా అని ప్రిన్సిపల్ డాక్టర్ కేశవరావు పేర్కొన్నారు. పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం తెలుగు అధ్యాపకులు దేవిశెట్టి రామన్న ఆధ్వర్యంలో మహాకవి గుర్రం జాషువా వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ కేశవరావు, వైస్ ప్రిన్సిపల్ జయప్ప జాషువా రచనలు, పద్యాలు సమాజాన్ని చైతన్యం చేశాయని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు యశోద రాణి, నారాయణ, చంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

జాషువా వర్ధంతి సభలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ కేశవరావు

## అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి-రొద్దం

రాష్ట్ర వ్యాపంగా ప్రజల జీవితాల్లో కూటమి ప్రభుత్వం సంతోషం నింపుతోందని టిడిపి మండల నాయకులు పేర్కొన్నారు. రొద్దంలో గురువారం టిడిపి ఆధ్వర్యంలో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం నిర్వహించారు. మండల నాయకులు ఇంటింటికీ వెళ్లి సుపరిపాలన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల నాయకులు చిన్నప్పయ్య, శ్రీనాథ్‌చౌదరి, క్రిష్టప్ప, తిరుపాల్ నాయుడు, చంద్రశేఖర్, సిద్ధన్న, చెన్నకేశవులు, ఉమాశంకర్, అక్బర్, తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలన కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

## సోలార్ రూఫ్‌టాప్ నిర్మాణంలో ఆదర్శంగా నిలుద్దాం

### ఎమ్మెల్యే పరిటాల సునీత

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

ఇంటిపై సోలార్ ఏర్పాటు చేసుకోవడంలో చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి మండలాలు రాష్ట్రానికే ఆదర్శంగా నిలవాలని ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ప్రజలకు సూచించారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం, సోలార్ రూఫ్ టాప్ నిర్మాణంపై గురువారం మండలంలోని నాగసముద్రం గేట్‌లో విద్యుత్ శాఖ ఏడీఈ కార్యాలయం లో అవగాహన సదస్సు నిర్వహించారు. పిఎం సూర్య ఘర్ పథకం ద్వారా అందించే సోలార్ సెట్‌ను ప్రదర్శనకు ఉంచారు. ఇది ఎలా పని చేస్తుంది.. ఎంత ఖర్చు చేయాలి.. ప్రభుత్వ సబ్సిడీ, బ్యాంకు రుణాలు, దీని వల్ల కలిగే ప్రయోజనాలు, తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని జిల్లాలో రాప్తాడు నియోజకవర్గం నుంచే ప్రారంభిస్తున్నామన్నారు. సామాన్యులు సైతం విద్యుత్ భారం లేకుం డా ఇంటిపైన సోలార్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. దీనిపై ప్రజల్లో పలు సందేహాలు, అనుమానాలు ఉన్నాయని, వీటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గ్రామాలకు వెళ్లి ప్రజలకు వీటి గురించి వివరించాలన్నారు. రుణాల విషయంలో బ్యాంకర్లు పాత వాటి గురించి ప్రస్తావన తీసుకు రావద్దన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమిష్టిగా పని చేస్తే ఈ కార్యక్రమాన్ని వందశాతం విజయవంతం చేయవచ్చన్నారు. సదస్సులో విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్ కుమార్, పరిటాల శ్రీరామ్, ఇతర అధికారులు, సోలార్ కంపెనీ, బ్యాంకుల ప్రతినిధులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సోలార్ రూఫ్‌టాప్ సెట్టింగ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, అధికారులు

ఎమ్మెల్యే ఎంఎస్.రాజు దంపతులతో శ్రీకాంత్ దంపతులు

## ఎమ్మెల్యే ఇంట్లో హీరో శ్రీకాంత్ దంపతులు

ప్రజాశక్తి-మడకశిర

అనంతపురం నగరంలోని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు నివాసానికి గురువారం సినీనటుడు శ్రీకాంత్, ఊహ దంపతులు వెళ్లి ఎమ్మెల్యే దంపతులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌ను చూసేందుకు అభిమానులు, ప్రజలు ఎంతో ఆసక్తిగా తరలివచ్చారు. అలాగే ఎమ్మెల్యే బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులు పలువురు శ్రీకాంత్‌ను కలిశారు.

## డి.చెర్లోపల్లిలో పర్యటించిన కేంద్ర బృందం

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండలంలోని డి.చెర్లోపల్లి గ్రామ పంచాయతీలో స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్-2025లో భాగంగా కేంద్ర బృందం సభ్యులు గురువారం పర్యటించారు. స్థానిక ఎంపియుపి స్కూల్, అంగన్వాడీ కేంద్రం, పిహెచ్‌సి, మసీదు, గ్రామసచివాలయం, చెత్త సంపద కేంద్రం తదితర వాటిని సందర్శించారు. పారిశుధ్య చర్యలను పరిశీలించారు. మరుగుదొడ్లు, నీటి వసతి, పరిసరాలు పరిశుభ్రత, మురుగు నీటి వనరులను పరిశీలించారు. కార్యక్రమంలో కేంద్రబృందం సభ్యులు బి.రామచంద్ర, జిల్లా ఎస్‌బిఎం కోఆర్డినేటర్లు, వి.శ్రీనివాసులు, డి.సాయి నాథ్‌బాబు, ఎంపీడీవో నరసింహనాయుడు, డిప్యూటీ ఎంపీడీవో కిష్టప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ ఆర్.జ్యోతిబాయి, సర్పంచి జి.రమాదేవి, పంచాయతీ సెక్రెటరీ ఎస్.నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

## వైసిపివి తప్పుడు ఆరోపణలు : టిడిపి

ప్రజాశక్తి-మడకశిర

సిఎం చంద్రబాబు సహకారంతో నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసిపి సమన్వయకర్త ఈరలక్కప్ప తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని టిడిపి రాష్ట్ర కుంచిటి ఒక్కలిగ కన్వీనర్ విఎం. పాండురంగప్ప తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పట్టణంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నియోజక వర్గంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలవుతుంటే వైసిపి ఉనికి కోల్పోతుందన్న భయంతో ఈరలక్కప్ప టిడిపిపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

**గుడిబండ :** టిడిపిపై వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప చేసిన ఆరోపణలను మండల టిడిపి నాయకులు తీవ్రంగా ఖండించారు. టిడిపి సీనియర్ నాయకులు న్యాయవాది శివకుమార్ ఇంటి ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, సింగిల్‌విండో అధ్యక్షులు మద్దనకుంటప్ప, శివకుమార్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మంజునాథ్, వీరశైవ లింగాయత్ జిల్లా అధ్యక్షులు దుర్గేష్, ఎంపిటిసి శశిధర్ మాట్లాడారు. ఉనికి కోసమే ఈరలక్కప్ప టిడిపిపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో పర్యటించి సమస్యలు తెలుసుకుని మాట్లాడాలే కానీ పెత్తందారులు, మీ యజమానులు రాసిచ్చిన వాటిని చదువొద్దని హితవు పలికారు. లాయర్ శివకుమార్, భీమరాజు, షబ్బీర్, జనార్ధన్, శ్రీరామప్ప, ఈరన్న, నిరంజన్, రుద్రమని పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

## 'మా ఇళ్లకు దారి చూపండి'

### కొండాపురం గ్రామస్తుల వేడుకోలు

ప్రజాశక్తి-పెనుకొండ

భూకబ్జాదారుల కారణంగా తాతల కాలం నుంచి ఉన్న సొంత ఇళ్లకు దారి లేకుండా పోయిందని.. మా ఇళ్లకు దారి చూపి న్యాయం చేయాలని మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన పలువురు మొర పెట్టుకుంటున్నారు. బాధితులు.. ప్రవీణ్ కుమార్‌రెడ్డి, నాగలక్ష్మి, రామాంజనేయరెడ్డి, అంజనరెడ్డి, లక్ష్మీదేవమ్మ, నాగరాజు తదితరులు విలేకరుల వద్ద గోడు వెళ్లబోసుకున్నారు. పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని కొండాపురంలో ఎన్‌పి.నరసింహారెడ్డి, ఎన్‌పి. సూర్యనారాయణరెడ్డి సర్వే నెంబర్-708లోని గ్రామ కంఠం భూమిని కబ్జా చేసి ప్రహరీ నిర్మించడం వల్ల 10 కుటుంబాల ఇళ్లకు వెళ్లేందుకు దారి లేకుండా పోయిందన్నారు. ఈ విషయంపై ఆర్డీవో, తహశీల్దార్, కమిషనర్లకు ఫిర్యాదు చేయగా తహశీల్దార్ కంటితుడుపు చర్యగా పరిశీలించి మీకు న్యాయం చేస్తామన్నారు. 15హేను రోజులు గడచినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. ప్రస్తుతం రైల్వే స్థలంలో రాకపోకలు సాగిస్తున్నామని తెలిపారు.

అధికారులకు ఇచ్చిన అర్జీలు చూపుతున్న బాధితులు

**గ్రామకంఠం భూమి కబ్జా చేస్తే మాకు సంబంధం లేదు : తహశీల్దార్ స్వాతి**

గ్రామకంఠం భూమి కబ్జా చేస్తే మాకు సంబంధం ఉండదు. నగర పంచాయతీ అధికారులకు వర్తిస్తుంది. తాము సర్వే చేసి ఎంత భూమి కబ్జా చేశారో అది మాత్రమే తెలుపుతాం.

**చర్యలు తీసుకుంటాం: ఆర్డీవో ఆనంద్ కుమార్**

కొండాపురం గ్రామంలో పరిశీలించి అనధికారికంగా చేపట్టిన కట్టడాలను తొలగించి చర్యలు తీసుకుంటాం. దారి లేని కుటుంబాలకు న్యాయం చేస్తాం.

## ఆహార భద్రత పాటించని వారిపై చర్యలు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

ఆహార భద్రతా ప్రమాణాలు పాటించని హోటల్ యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఆహార భద్రత అధికారి రామచంద్రయ్య హెచ్చరించారు. సత్యసాయి శతజయంతి ఉత్సవాలను దృష్టిలో ఉంచుకొని ఆయన మున్సిపల్ సిబ్బందితో కలిసి పట్టణంలోని పలు హోటళ్లను సందర్శించి తినుబండారాలు, పరిశుభ్రతను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, హోటళ్లలో, బేకరీలలో, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో నాణ్యత ప్రమాణాలు లేకుండా తినుబండారాలు అందిస్తే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని జరిమానాలు సైతం విధిస్తామని హెచ్చరించారు. సత్యసాయి జయంతి ఉత్సవాల ను దృష్టిలో ఉంచుకొని ఇకపై ప్రతి హోటల్‌ను తనిఖీ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆహార భద్రత అధికారికి గణేష్, మున్సిపల్ శానటరీ ఇన్స్‌పెక్టర్ శివయ్య, పర్యావరణ కార్యదర్శి ఉమా శంకర్, మోహన్ కుమార్, సుదర్శన్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

## బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-రొద్దం

సాధారణ బదిలీల్లో భాగంగా మండలంలోని సానిపల్లి జడ్పీ హైస్కూల్ నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను గురువారం హెచ్ఎం ఆంజనేయులు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. పాఠశాల నుంచి బదిలీలపై వెళ్తున్న నారాయణస్వామి, కృష్ణానాయక్, లక్ష్మినారాయణ, మోహన్‌రెడ్డిలను శాలువాలు, పూలమాలలతో సత్కరించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ శ్రీనివాసులు, సిబ్బంది పోతలయ్య, గోపాల్, పర్వతయ్య, లక్ష్మినరసమ్మ, జయమ్మ, సత్యమయ్య, ఆదినారాయణ, రంగేష్, శ్రీనివాసరావు, రమేష్, క్రిష్టప్ప, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయ బృందం

## ఎర్రకోట వేడుకలకు గొట్లూరు సర్పంచి

**ప్రజాశక్తి - ధర్మవరం రూరల్**

ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరగనున్న స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి ముగ్గురు సర్పంచులకు పాల్గొనే అరుదైన అవకాశం లభించింది. అందులో ఒకరు ధర్మవరం నియోజకవర్గంకు చెందిన గొట్లూరు గ్రామ సర్పంచి పిట్టా నరసమ్మ ఎంపికైంది. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ నరసమ్మకు ఫోన్‌చేసి అభినందనలు తెలిపారు.

## ఉచిత కంటివైద్య శిబిరం

**ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు**

పుట్టపర్తి కి చెందిన పీస్ వెల్ఫేర్ సొసైటీ డాక్టర్ బొగ్గు సురేష్ సహకారంతో మండలంలోని తంగేడికుంట హై స్కూల్ లో పిల్లలకు ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో 200 మందికి పరీక్షలు నిర్వహించగా కంటికి సంబంధించి 10 మందికి అద్దాలకు రిఫర్ చేయడం జరిగింది .ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, పిఇటి రాజేశ్ , తిరుపాలు ,జనార్ధన్, పాఠశాల సిబ్బంది తో పాటు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ అచ్యుతానందన్‌కు నివాళి

**ప్రజాశక్తి - నల్లమాడ**

కేరళ మాజీ ముఖ్యమంత్రి కామ్రేడ్ అచ్యుతానందన్ మృతికి సిపిఎం స్థానిక నాయకులు నివాళులు అర్పించారు. నాయకులు గోవిందు, మల్లికార్జున, రాజు, రామయ్య, రామాంజి ఆధ్వర్యంలో మండలంలో పాత బస్టాండ్ సర్కిల్లో అచ్యుతానందన్ చిత్రపటానికి నివాళి అర్పించారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

**ప్రజాశక్తి - ధర్మవరం రూరల్**

అర్హులకు మంజూరైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను టిడిపి ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ గురువారం పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని 13మందికి రూ.5.80 లక్షల రూపాయల విలువైన చెక్కులను పంపిణీ చేశారు.

## ఆర్వో ప్లాంట్ ప్రారంభం

**ప్రజాశక్తి - చిలమత్తూరు**

మండలంలోని టేకులోడు మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలికల గురుకులంలో సాహితీ గగన్ మహల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వెయ్యి లీటర్ల సామర్థ్యం గల ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. రూ.1.70 లక్షల విలువైన ఈ ప్లాంట్‌ను సీసీఎల్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ హైదరాబాద్ సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ క్రింద విరాళంగా అందించింది. ట్రస్ట్ అధ్యక్షుడు జే. ప్రతాప్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

## 28న కలెక్టరేట్ ముట్టడి

**ప్రజాశక్తి - ధర్మవరం రూరల్**

ఎస్సీ ,ఎస్టీ ,బీసీ, మైనార్టీ ,ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈనెల 28న నిర్వహించనున్న చలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాలకు ఎస్సీ జన సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ దాసగానిపల్లె కుల్లాయప్ప పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా కుల్లాయప్ప మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై పోరాడటానికి అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ముందుకు రావాలన్నారు. ఈనెల 28న చలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు హాజరై మద్దతు తెలిపాలని కోరారు. అ కార్యక్రమంలో ఎస్సీ జన సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ దాసగానపల్లి కుల్లాయప్ప, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఎమ్మెస్ ఆదినారాయణ, ఏపీ ఎమ్మార్పీఎస్ కేసగాళ్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాస ఉత్సవాలు

**ప్రజాశక్తి - నల్లచెరువు**

మండలంలోని పాలపాటి దీన్నెవద్ద గల ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి శ్రావణమాసం ఉత్సవాలు ప్రారంభమవుతున్నట్లు ఆలయ అర్చకులు ఆంజనేయదాస్ తెలిపారు. ఆగస్టు నెల 23 వరకు ఈ ఉత్సవాలు జరగనున్నట్లు చెప్పారు. ఈసందర్భంగా ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. భక్తుల రద్దీ దృష్ట్యా పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేసినట్లు నల్లచెరువు ఎస్ఐ మక్బూల్ బాషా తెలిపారు

## క్లాప్ మిత్రకు ఆర్థికసాయం

**ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్**

మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామపంచాయతీలో క్లాప్ మిత్రగా పనిచేస్తున్న నరసింహులు అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో అతని చికిత్స నిమిత్తం జిల్లా పంచాయతీ అధికారి సమత ఆర్థిక సహాయం అందించారు. గురువారం చర్లపల్లి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి 5వేల రూపాయల ఆర్థికసాయాన్ని నరసింహులుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకుడు దేవేంద్ర రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు గ్రామస్తులు పాల్గొన్నారు.

**IN THE COURT OF THE I St ADDL, JUNIOR CIVIL JUDGE ANANTHAPURAMU**
**O.S NO:19/2023**

**Between:**
Uci Bank Rep by its Branch Manager, Raju Road, Ananthapuramu ... **Plaintiff**
**AND**
T.M Bharath Kumar and another ...**Defendants**

**Notice to the Defendant No:1 and 2**

**D1:** T.M Bharath Kumar, S/o T.M Aswartha Narayana, resident of D.No 15-66, S.B.I Colony, Dharmavaram, Ananthapuramu dist Now at Sri Satya Sai Dist.
**D2:** T.M Aswartha Narayana, resident of D.No 15-66, S.B.I Colony, Dharmavaram, Ananthapuramu dist now at Sri Satya Sai Dist.
పై నెంబరు కేసులో Defendants అయిన మీ హాజరు నిమిత్తము 13-08-2025వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు

**(By order of the court)**
**T.RAJARAM,**
**Advocate, Anantapuramu**
**Cell: 9440286323**

# కళాశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి : ఎస్ఎఫ్ఐ

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**ప్రజాశక్తి - బుక్కపట్నం**

మండల కేంద్రంలో అసంపూర్తిగా నిలిచిపోయిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనానికి నిధులు మంజూరు చేసి, భవనాన్ని పూర్తి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో దాదాపు ఏడు సంవత్సరాల క్రితం డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి పనులు ప్రారంభించారన్నారు. దాదాపు మూడు కోట్ల రూపాయలతో భవనం ప్రారంభించగా బిల్లులు రాకపోవడంతో కళాశాల భవనం అసంపూర్తిగా నిలిచిపోయిందన్నారు, ప్రభుత్వాలు మారినప్పటికీ కళాశాల భవనం పూర్తి కాలేదని విమర్శించారు. దీనితో కళాశాల భవనం మట్టి గోడలకే పరిమితమై, ముళ్ల పొదలతో నిండి పోయిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కలుగజేసుకొని తక్షణమే నిధులు మంజూరు చేసి డిగ్రీ కళాశాల భవన పనులు ప్రారంభించాలని లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ నరసింహులకు సమర్పించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి విష్ణు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## డీలర్ల సంఘం మండల అధ్యక్షులుగా రామకృష్ణారెడ్డి

**ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు**

డీలర్లసంఘం మండల అధ్యక్షులుగా పిట్ట రామకృష్ణారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండల స్టోర్ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీలర్ల మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా అధ్యక్షుడిగా పిట్ట రామకష్ణారెడ్డి ( రాజారెడ్డి) ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు స్టోర్ డీలర్లు తెలిపారు. ఉప అధ్యక్షులుగా డి. షామున్, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్ రెడ్డి, ట్రెజరర్‌గా బాబా ఫక్రుద్దీన్, కార్యదర్శులుగా ట్రిప్ నాగరాజు, బామ రాజు, నాగేంద్ర, ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా డీలర్లు నూతన అధ్యక్షుడిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండోజి ఆరిఫ్ ఖాన్, సౌదీ నాగరాజు, రామ నాయుడు, బాబా ఫక్రుద్దీన్, కరుణాకర్ రెడ్డి, నాగేంద్ర, రామ్ రెడ్డి, సోమశేఖర్, రామిరెడ్డి, గంగులప్ప, రామాంజనేయులు, రామకృష్ణారెడ్డి, నాగరాజు, చంద్రశేఖర్ నాయుడు, రమణారెడ్డి, కర్ల నాగరాజు, జయ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిఎస్‌పి నూతన కార్యవర్గం ఏర్పాటు

**ప్రజాశక్తి-హిందూపురం**

పార్టీ అన్ని విధాల పటిష్ఠంగా ఉండాలంటే దృఢమైన కార్యవర్గం తోనే సాధ్యమవుతుందని అందుకోసమే ప్రస్తుతం ఉన్న కార్యవర్గాల్లో మార్పులు చేస్తున్నామనిబహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షులు గొల్ల కుంట నాగరాజు తో కలిసి శ్రీరాములు నూతన కార్యవర్గాలను ఎన్నుకొన్నారు. ఈ సమావేశంలో నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.

## రాష్ట్రాభివృద్ధి 'కూటమి'తోనే సాధ్యం : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్**

రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పుట్టపర్తి మండలంలోని బొంతలపల్లి గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు కరపత్రాలు ద్వారా వివరించారు. రాష్ట్రం ఆర్థికంగా ఎంతో నష్టపోయినప్పటికీ ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామన్నారు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పెడపల్లి, వెంగళమ్మ చెరువు, సింగల్ విండో అధ్యక్షులు విజయకుమార్, శ్రీరామ్ రెడ్డి, టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మాజీ జెడ్పిటిసి శ్రీరామ్‌నాయక్, నాయకులు బొమ్మయ్య, పుల్లప్ప, సర్పంచి శ్రీనివాసులు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధురాలికి కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

**కదిరి టౌన్ :** పట్టణంలోని 34 వ వార్డు పార్థసారథి కాలనీ లో నిర్వహించిన సుపరిపాలనలో–తొలి అడుగు కార్యక్రమంలో కదిరి నియోజకవర్గ పరిశీలకులు వహీద్ హుస్సేన్ పాల్గొన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టిన సంక్షేమం అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో కదిరి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, వార్డు సభ్యులు నరసింహులు,గంగిశెట్టి, రఘునాథ్, రాము, రవి,శ్రీ రాములు, కిష్ట, ఫక్రుద్దీన్, అంజనప్ప, హరి నాథ్ తదితరులు పాల్గొన్నారు

# నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు : జేసీ

సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

**ప్రజాశక్తి-హిందూపురం**

హిందూపురం నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న పోలింగ్ కేంద్రాలలో 1300 పైగా ఉన్న ఓటర్ల పోలింగ్ కేంద్రాలను విభజించి కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందనిజాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. గురువారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా సవరణ, నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై నియోజక వర్గ ఎన్నికల అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛందంగా ప్రతి ఒక్కరూ ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఓటరు నమోదుకు ఫారం–6, ఓటు తొలగింపుకు ఫారం -7, సవరణలకు ఫారం–8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. అలాగే ప్రతి ట్రాన్స్ జెండర్ ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలియజేశారు. నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఓటర్ ఆధార్ అనుసంధాలపై రాజకీయ పార్టీల నాయకులు అంగీకరించారు. ఈ సమావేశంలో తహశీల్దార్లు వెంకటేశు ,సౌజన్య లక్ష్మి, నటరాజ్‌తో పాటు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, డిప్యూటీ తహశీల్దార్ మైనుద్దీన్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి, మండల ఆర్ఐ అమరేంద్ర, రెవెన్యూ సిబ్బంది, ఎన్నికల సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పోస్ట్ కార్డుల ఉద్యమం

**ప్రజాశక్తి - బుక్కపట్నం**

పేద ప్రజల అభ్యున్నత కోసం పాటుపడుతున్న ఆర్డీటీ ఎఫ్‌సిఆర్ఎ అకౌంట్ పునరుద్దించాలని మండల కేంద్రంలో పోస్ట్ కార్డుల ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్డీటీ అభిమాన సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బాలికలచేత పోస్ట్ కార్డుల ఉద్యమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఓం ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

**కొత్తచెరువు :** 'సేవ్ ఆర్‌డిటి –సేవ్ అనంత' అనే నినాదం తో సామాజిక వేత్త ఓంప్రసాద్ ఆధ్వర్యంలో, ఆర్ డి టి పరిరక్షణ సమితి సభ్యులతో కలసి పోస్ట్ కార్డ్ ఉద్యమం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర జిల్లా ఉన్నత పాఠశాలలో విద్యార్థులచేత పోస్టుకార్డుల ఉద్యమం చేపట్టారు.

## తాగునీటి సమస్య పరిష్కరించాలని మహిళల నిరసన

**ప్రజాశక్తి - కొత్తచెరువు**

కొత్తచెరువు సమీపంలోని నాగిరెడ్డిపల్లి వద్ద ఉన్న జగనన్న కాలనీలో గత వారం రోజులుగా నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆ కాలనీ మహిళలు నిరసన వ్యక్తం చేశారు. కాలనీ వద్ద మహిళలు ఖాళీ బిందెలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కాలనీలో తాగునీరు విద్యుత్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. రాత్రి వేళల్లో విద్యుత్ లైట్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. తమ సమస్యలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవటం లేదని విమర్శించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి తక్షణమే మోటార్ మరమ్మతు చేయించాలని డిమాండ్ చేశారు.

# ఆడబిడ్డ నిధి పథకానికి మంగళం : వైసిపి

వైసిపి నాయకులతో దీపికా వేణు రెడ్డి

**ప్రజాశక్తి - హిందూపురం**

ఎన్నికలకు ముందు ఆడబిడ్డ నీది అంటూ మహిళలను ఆశపెట్టి.... నేడు ఆ పథకానికి మంగళం పాడేందుకు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కార్ సిద్ధమైందని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త దీపికా వేణు రెడ్డి విమర్శించారు. మంత్రి అచ్చం నాయుడు ఆడబిడ్డ నిధి పథకాన్ని ఎత్తివేస్తున్నామని పరోక్షంగా ప్రకటించడం ద్వారా మహిళలను మానసికంగా సిద్ధం చేస్తున్నారని ధ్వజమెత్తారు. విషయంపై గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆమె మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు ఏడాది గడిచిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోగా ఒక్కో పథకాన్ని ఎత్తేసే కుట్రలకు ప్రభుత్వం తెరదీస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రెండు కోట్ల మంది మహిళలు నమ్మించి వందించడానికి చంద్రబాబు మరోసారి సిద్ధమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**సమన్వయంతో పార్టీని బలోపేతం చేద్దాం :** నాయకులు, కార్యకర్తలు అందరూ సమన్వయంతో వ్యవహరించి పార్టీని మరింత బలోపేతం చేద్దామని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త దీపిక, నాయకులు గుడ్డంపల్లి వేణు రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో వైసిపి ఎస్సీ సెల్ నాయకులు నియోజకవర్గ సమన్వయకర్త దీపిక, గుడ్డంపల్లి వేణు రెడ్డిని కలిశారు. జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు నరసింహమూర్తి ఆధ్వర్యంలో నాయకులు కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు సూర్య మోహన్, మాజీ కౌన్సిలర్ రామ్మూర్తి, సీనియర్ నాయకులు బాపూజీనగర్ శ్రీరాములు, నరసింహులు, మేళాపురం రవి, శ్రీకాంత్, జంగం చందు, మద్దిలేటి, నారాయణప్ప, శీనప్ప, అంజిన్నప్ప, మూర్తి, అశ్వర్థ, సిద్ధప్ప, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## బ్లాంకెట్ సర్వే నిర్వహణపై శిక్షణ

**ప్రజాశక్తి - బత్తలపల్లి**

బత్తలపల్లి,తాడిమర్రి మండలాలలో రైతు సేవా కేంద్రాలలో విధులు నిర్వహిస్తున్న పశుసంవర్ధక సహాయకులకు బ్లాంకెట్ సర్వే నిర్వహణ పై స్థానిక పశు వైద్యాశాలలో శిక్షణ ఇచ్చారు. గురువారం నిర్వహించిన బ్లాంకెట్ సర్వే శిక్షణలో పశుపోషణ జీవనోపాధిగా ఉన్న కుటుంబాలు కు సంబంధించి పాడి రైతుల క్రెడిట్‌లు, పశుబీమా, పశువైద్యసేవలు, శాఖ లో కొనసాగుతున్న ప్రభుత్వ పథకాలు గురించి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రాంతీయ పశువైద్యాశాల ఏడీ డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ గురునాథ్‌రెడ్డి, , తాడిమర్రి పశువైద్యులు డాక్టర్ యునస్, సిబ్బంది, పశుసంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న అధికారులు

# విద్యతోనే లక్ష్యాలు సాధ్యం : ఎమ్మెల్యే


ప్రతిభా విద్యార్థికి పురస్కారం అందజేస్తున్న ఎమ్మెల్యే కందికుంట

**ప్రజాశక్తి - కదిరి టౌన్**

విద్యార్థులు విద్యను భారంగా కాకుండా బాధ్యతగా భావించి మంచి ఫలితాలు సాధించాలని తద్వారా అనుకున్న లక్ష్యాలను సాధించగలరని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు అనంతపురంలోని తొగటి వీర క్షత్రియ సంఘం భవనంలో నిర్వహించిన పురస్కారాల ప్రదాన కార్యక్రమానికి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొగట వీర క్షత్రియ కళ్యాణ భవన్ అధ్యక్షుడు దాసరి శ్రీధర్ అధ్యక్షతన జరిగిన పురస్కారాల ప్రదానోత్సవం లో ఎమ్మెల్యే కందికుంట మాట్లాడుతూ సమాజంలో అసమానతలు తొలగిపోవాలంటే చదువు ఒక్కటే మార్గం అని అన్నారు. భవిష్యత్తులో కులం కన్నా ఆర్థిక వ్యవస్థ మార్పులకు అనుగుణంగా వృత్తుల్లో కూడా మార్పులు చోటు చేసుకుంటాయని అన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ గ్లోబలైజేషన్ అవుతున్న నేపథ్యంలో మరిన్ని మార్పులు వస్తాయని పేర్కొన్నారు. పిల్లలు చదువుకోవడం ద్వారానే వాటిని అందుకోగలరని చెప్పారు. చేనేత కులాలకు చెందిన ఎంతోమంది పిల్లలు నేడు ఉన్నత చదువులు చదివి ఇతర రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రుల్లో కూడా మార్పులు రావాలని మారుతున్న కాలానుగుణంగా పిల్లలను తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నగదు పురస్కారాల తో పాటు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తొగట వీర క్షత్రియ కళ్యాణ్ భవన్ అధ్యక్షుడు దాసరి శ్రీధర్, ఉపాధ్యక్షులు బంధనాదం ఆంజనేయులు, టి రామంజప్ప, ప్రధాన కార్యదర్శి చింత వెంకటేశ్వర్లు, ట్రెజరర్ చిదంబరయ్య, శేషయ్య, రూప ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# నేరాలు ఘోరాలు

## రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాశక్తి - ధర్మవరం రూరల్**

పట్టణంలోనని మారుతీనగర్ చెందిన మోహన్ రెడ్డి (45) అనే వ్యక్తి గురువారం పోతుగుంట రైల్వే గేటు సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి ఒక కొడుకు, కూతురు భార్య మాధవి ఉన్నారు. మృతుడు మోహన్ రెడ్డి నల్లమాడ మండల కేంద్రంలో పంచాయతీరాజ్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ గా( కాంట్రాక్ట్) పని చేస్తున్నాడు. మోహన్ రెడ్డి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సుంది.

## యువకుడు అదృశ్యం

**ప్రజాశక్తి - కొత్తచెరువు**

మండల పరిధిలోని నారేపల్లి గ్రామానికి చెందిన గజ్జి క్రిష్టప్ప కుమారుడు గజ్జి ప్రశాంత్ కుమార్ ఈనెల 19వ తేదీ మాచర్లలోని ఇంజనీరింగ్ కళాశాలలో చేరడానికి ఇంటి నుండి వెళ్లి ఇప్పటివరకు రాలేదని ఫిర్యాదు అందినటుల పోలీసులు తెలిపారు. యువకుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సిఐ మారుతి శంకర్ తెలిపారు.

## నాటుసారా తయారీదారులు అరెస్టు

**ప్రజాశక్తి - బుక్కపట్నం**

మండల పరిధిలోని నార్సింపల్లి పల్లి తండాకు చెందిన నాటు సారా తయారీదారులను అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సిఐ నాగరాజు తెలిపారు. ఏప్రిల్ నెలలో గ్రామంలో నాటు సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించగా ఈ దాడులలో నిందితులు గ్రామానికి చెందిన పూజారి మురళి నాయక్, మురళి నాయక్ అనే ఇద్దరు వ్యక్తులు పారిపోయి తప్పించుకొని తిరుగుతుండగా గురువారం వారిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి కోర్టుకు తరలించగా కోర్టు రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ ఉమా మనోహర రాజు, సిబ్బంది ప్రసాద్, సురేష్ బాబు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెలపై చిరుత దాడి

**ప్రజాశక్తి - పరిగి**

మండలంలోని అందంపల్లి పంచాయతీ కొత్త నరసాపురం గ్రామానికి చెందిన రామాంజి అనే గొర్రెలకాపరికి చెందిన గొర్రెలపై చిరుత దాడ చేసింది. రామాంజి తన గొర్రెల మందను బుధవారం మేతకు తీసుకెళ్లాడు. సాయంత్రం గొర్రెల మంద నుండి ఐదు గొర్రెలు తప్పిపోయినట్లు రామాంజి గుర్తించాడు. ఉదయం తమ గొర్రెల ఆచూకీ కోసం వెళ్లగా అడవిలో చిరుతపులి ఆనవాళ్ళతో పాటు అక్కడే మృతిచెందిన తన గొర్రెలను గమనించాడు. అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతిచెందిన గొర్రెలకు డాక్టర్ కృష్ణనాయక్ పోస్టుమార్టం నిర్వహించారు. చుట్టూ ప్రాంతాలలో చిరుత అనవాళ్లను పరీక్షల కోసం తీసుకెళ్లినట్లు అటవీ శాఖ అధికారి రాహుల్ తెలిపారు.

## ఎక్సైజ్ అధికారుల తనిఖీలు

**ప్రజాశక్తి-హిందూపురం**

హిందూపురం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం ఎక్సైజ్ సిఐ లక్ష్మి దుర్గయ్య ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ఒకరిని అరెస్టు చేయడంతో పాటు ద్విచక్ర వాహనం, అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నారు.. పట్టణ సమీపంలోని పోజనపల్లి వద్ద వాహనాలను తనఖీ నిర్వహిస్తుండగా కర్నాటక రాష్ట్రం తుమకురు జిల్లా మధుగిరి తాలూకా కొడిగేపల్లి పంచాయితీ తింగళూరు గ్రామానికి చెందిన సిద్దరాజు కుమారుడు ప్రభు కుమార్ తన జూపిటర్ ద్విచక్ర వాహనంలో హయవార్డ్స్ విస్కీ ఏ188 టేట్రా ప్యాకెట్స్ (19 లీటర్లు) కర్నాటక మద్యం తరలిస్తున్న ప్రభు కుమార్ ను అరెస్టు చేసి, మద్యంతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొన్నామన్నారు. అదే విధంగా కర్నాటక మద్యం అక్రమ రవాణ కేసులో నలుగురుకి బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. ఈ తనిఖీల్లో ఎస్ఐలు పృథ్వీరాజ్, ఫరూక్, నారాయణ స్వామి, హెడ్ కానిస్టేబుళ్లు నరసింహ, వెంకటేష్, రమణ, సతీష్, కానిస్టేబుళ్లు అంజి, సురేష్, రవీంద్ర, కుమార్, రంగధామ, శివ, సుధాకర్ రెడ్డి, ఉస్మాన్, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

## మహిళ అదృశ్యం

**ప్రజాశక్తి కదిరి టౌన్**

పట్టణంలోని కుటాగుల్ల , బెస్త వీధిలో నివాసమండే సాకే యశోద, అనే 30 సంవత్సరాల మహిళ అదృశ్యమైందని ఆమె ఆచూకీ తెలపాలని యశోద భర్త రాజశేఖర్ ఫిర్యాదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. మహిళ భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వారు చెప్పారు.

## హోంగార్డు కుటుంబానికి చేయూత

**ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్**

ఇటీవల మృతి చెందిన హోంగార్డ్ తిరుపాల్ నాయక్ కుటుంబానికి తోటి హోంగార్డులు చేయూతను అందించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ వి.రత్న చెక్కు మృతుని భార్యకు చెక్కును అందజేశారు. తలుపుల మండలంలోని ఒబిఆర్ తండాకు చెందిన తిరుపాల్ నాయక్ 2025 జూన్ 2న మతి చెందారు. జిల్లాలో ఉన్న హోంగార్డులందరూ ఒక రోజు వేతనం కింద రూ 4.33లక్షలను ప్రకటించారు. ఈ మేరకు గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఎస్పీ చాంబర్లో తిరుపాల్ నాయక్ భార్య శాంతమ్మ కు జిల్లా ఎస్పీ చేతులు మీదుగా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్‌పి శ్రీనివాసులు, ఎస్‌బి సిఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, ఆర్ఐలు వలి, మహేష్, హోమ్ గార్డ్ ఇన్‌ఛార్జి రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

**ప్రజాశక్తి - పరిగి**

మండలంలోని శాసనకోట రహదారిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విద్యార్థి అఖిల్ కుమార్ అంత్యక్రియల కోసం మండల టిడిపి నాయకులు ఆర్థికసాయం అందజేశారు. ఈ మేరకు మృతుని కుటుంబసభ్యులకు 10 వేల రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గోవింద్ రెడ్డి, సర్పంచి బాలాజీ, మాజీ జెడ్పిటిసి సూర్యనారాయణ, సోమప్ప, శాసనకోట వెంకటేష్, ఊటకూరు రామకృష్ణ, నాగరాజు, గంగాధరప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చౌడేశ్వరి జయంతి

**ప్రజాశక్తి - పరిగి**

పరిగి మండలం కొడిగేనహళ్లి పంచాయతీ పరిధిలోని పెద్దిరెడ్డిపల్లిలో గురువారం చౌడేశ్వరి అమ్మవారి జయంతోత్సవాను ఘనంగా నిర్వహించారు. ఆలయకమిటీ నిర్వాహకులు వెంకటరమణ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలోని మహిళలతో కుంకుమార్చన చేయించి,ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు సోమప్ప, ఉపాధ్యక్షులు రుద్రప్ప, కోశాధికారి రమేశప్ప, రామకిష్టప్ప, సాదాశివప్ప, ప్రభాకర్, లక్ష్మీనారాయణరాజు మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న నాయకులు, గ్రామస్తులు

**చిలమత్తూరు :**మండల కేంద్రంలో చౌడేశ్వరి దేవి ఆలయంలో గురువారం అమ్మవారి జయంతిని తొగటవీరక్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించగా మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తొగటవీరక్షత్రియ సంఘం నాయకులు శ్రీనివాస్, ఆదిమూర్తి, ఆదినారాయణ, ఆంజనేయులు, చౌడప్ప తదితరులు పాల్గొన్నారు.

**హిందూపురం :** హిందూపురం ప్రాంతంలో గురువారం చౌడేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మున్సిపల్ పరిధిలోని ముద్దిరెడ్డిపల్లి తో పాటు వీవర్స్ కాలనీ, చౌడేశ్వరి కాలనీ తదితర ప్రాంతాల్లోని చౌడేశ్వరి దేవి ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మున్సిపల్ చైర్మన్ పర్సన్ డిఈ రమేష్ కుమార్ ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్, కౌన్సిలర్లు మహాలక్ష్మి, రాఘవేంద్ర, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.